క్లుప్తంగా

ఆకట్టుకున్న రెయిన్‌బో



ఆకాశంలో రెయిన్‌బో

ఉట్నూర్‌రూరల్: ఆకాశంలో మంగళవారం ఏర్పడిన రెయిన్‌బో చూపరులను ఆకట్టుకుంది. సాయంత్రం వేళ ఆకాశంలో వివిధ రంగులతో రెయిన్‌బో ఏర్పడటంతో చిన్నారులు సంతోషం వ్యక్తం చేస్తూ గంతులు వేశారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయండి

తలమడుగు: గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్ రాజమోహన్ అన్నారు. మంగళవారం మండలంలోని బరంపూర్ గ్రామపంచాయతీలో చేపడుతున్న తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులను పరిశీలించి మాట్లాడారు. వర్షాకాలంలో మురికి కాలువలు శుభ్రపరచాలన్నారు. అనంతరం పంచాయతీలో రిజిస్టర్లను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి అనిల్‌రెడ్డి, గ్రామపెద్దలు, కేదారేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన చరణ్‌గౌడ్



పుష్పగుచ్ఛం అందజేస్తున్న చరణ్‌గౌడ్

కైలాస్‌నగర్: తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేన రెడ్డిని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాయిచరణ్ గౌడ్ మంగళవారం కలిశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆయన పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలను తెలిపారు.

ఆక్రమణల తొలగింపు



పొక్లెయిన్‌తో ఆక్రమణ తొలగిస్తున్న దృశ్యం

కైలాస్‌నగర్: పట్టణంలోని కలెక్టరేట్ చౌక్, గాంధీ పార్కు సమీపంలో వెలిసిన ఆక్రమణలను మంగళవారం మున్సిపల్ అధికారులు తొలగించి వేశారు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారి అనురాధ ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాలకు చేరుకున్న బల్దియా సిబ్బంది జేసీబీతో అక్రమంగా ఏర్పాటు చేసిన టేలాలు, నిర్మాణాలను తొలగించి వేశారు. రోడ్లపై నిబంధనలకు విరుద్ధంగా టేలాలను ఏర్పాటు చేయొద్దని, అలాంటి వాటిని తొలగించి వేస్తామని టీపీఓ తెలిపారు. ఆక్రమణల తొలగింపును రెగ్యులర్‌గా నిర్వహిస్తామని ఆమె స్పష్టం చేశారు.

నీళ్లొస్తున్నయ్..!



సాక్షి స్పందన


నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులు నీటి కోసం పడుతున్న కష్టాలను మంగళవారం 'వర్షాకాలంలోనూ తప్పని నీటి ఘోష' అనే శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితం కాగా.. సంబంధిత శాఖ అధికారులు స్పందించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్, ఎంపీడీవో రమేశ్ గాదిగూడ మండల కేంద్రాన్ని సందర్శించారు. అక్కడి నీటి సమస్యను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. పాడైపోయిన విద్యుత్ మోటార్‌కు మరమ్మతు చేయించి, గాదిగూడ మండల కేంద్రంలో నీటి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకున్నారు. గ్రామంలో నీటి సరఫరా కావడంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేశారు. సమస్యాత్మక వాడల్లో గ్రామపంచాయతీ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేశారు. దాదాపు ఏ గ్రామాల్లో నీటి సమస్య లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

సీతక్కను కలిసిన నాయకులు

కైలాస్‌నగర్: మంత్రి సీతక్కను తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ములుగులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి సత్కరించారు. మిఠాయిలు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మల్లేష్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చరణ్ గౌడ్, మావల మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, నవీన్ రెడ్డి, నాగరాజు, రంజిత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

సులభంగా అర్థమయ్యేలా..!

- పుస్తకాల ముద్రణలో మార్పులు
- ఈ ఏడాది నుంచి 'పది' విద్యార్థులకు ద్విభాషా పాఠ్యపుస్తకాలు



ద్విభాషలో ముద్రించిన సామాన్యశాస్త్రం పాఠ్యపుస్తకం

నార్నూర్: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా సర్కారు బడుల విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం ఆంగ్ల విద్యను అమలు చేస్తోంది. అయితే ఆంగ్ల బోధన వింటున్న విద్యార్థులకు పాఠాలు సులభంగా అర్థమయ్యేలా వారిలో నైపుణ్యం పెంచేలా, మూడేళ్లుగా ద్విభాష (తెలుగు, ఆంగ్లంతో ముద్రించినవి) పుస్తకాలు అందిస్తోంది. ఏటా ఒక్కో తరగతి పెంచుతూ ద్విభాష పుస్తకాలను పంపిణీ చేస్తుండగా, ఈ విద్యా సంవత్సరం నుంచి పదో తరగతికి వర్తింపజేస్తున్నారు. ఈ మేరకు పాఠ్యపుస్తకాలు రాగా, వాటిని నార్నూర్, గాదిగూడ ఉమ్మడి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న దాదాపు 9485మంది విద్యార్థులకు మూడు వారాలుగా పంపిణీ చేస్తున్నారు.

విద్యార్థులు ఇబ్బంది పడకుండా...

చాలా సంవత్సరాల క్రితం అప్పటి ప్రభుత్వం సక్సెస్ పాఠశాలల పేరుతో కొన్ని పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమ బోధన ప్రారంభించింది. అయితే బోధించే ఉపాధ్యాయులు లేకపోవడంతో ఇవి పూర్తిస్థాయిలో విజయవంతం కాలేదు. ఇలాంటి నేపథ్యంలో తిరిగి 2022–23 విద్యా సంవత్సరం నుంచి విద్యాశాఖ అన్ని పాఠశాలల్లో ఆంగ్ల బోధన అమలుకు శ్రీకారం చుట్టింది. అయితే అప్పటి వరకు తెలుగు మాధ్యమంలో చదువుకున్న విద్యార్థులు, ఆంగ్ల మాధ్యమంలో చదవడం ఇబ్బందిగా మారుతుందని గుర్తించి, వారు తేలికగా అర్థం చేసుకునేందుకు పుస్తకాల ముద్రణలో మార్పులు చేశారు.

- ప్రతి పాఠ్యాంశంలో ఒక పేజీలో తెలుగు, మరో పేజీలో ఆంగ్లం ముద్రించారు. మొదటిసారిగా ఎనిమిదో తరగతి వరకు భాషేతర పుస్తకాలైన గణితం, సామాన్య శాస్త్రం, భౌతిక శాస్త్రం, సాంఘిక శాస్త్రం పుస్తకాల్లో ముద్రించారు. మరుసటి ఏడాది తొమ్మిదో తరగతికి అందించగా, ప్రస్తుత ఏడాది పదో తరగతికి వర్తింపజేస్తున్నారు. దీంతో విద్యార్థులు సులభంగా పాఠాలు అర్థం చేసుకునేందుకు ఉత్తీర్ణత శాతం పెరిగేందుకు అవకాశం లభించింది.
- అలాగే విద్యార్థులకు పుస్తకాల భారం పడకుండా, ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంది. ప్రతి పుస్తకాన్ని రెండు భాషల్లో ముద్రించడం వల్ల పేజీల సంఖ్య పెరిగి రెట్టింపు భారం అవుతుంది. ఈ సమస్య తలెత్తకుండా రెండు విభాగాలుగా పుస్తకాలను విభజించారు. సగం పాఠాలను భాగం–1, మిగితా సగాన్ని భాగం–2గా విభజించి రెండు దఫాలుగా పుస్తకాలను అందించనున్నారు. ఈ ఏడాది పదో తరగతి వరకు ద్విభాష పుస్తకాలను అందించడంతో ఇప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు ఆంగ్ల బోధన అందినట్లేనని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

ఉమ్మడి మండలంలో పాఠశాలల వారీగా వివరాలు..

నార్నూర్‌లో పాఠశాలలు	: 81
ఆయా పాఠశాలల్లో విద్యార్థులు	: 5,616
గాదిగూడలో పాఠశాలలు	: 80
ఆయా పాఠశాలల్లో విద్యార్థులు	: 3, 899

చాలా సులభంగా అర్థం అవుతుంది..



తెలుగు, ఆంగ్ల మాధ్యమంలో పుస్తకాలు ముద్రించడం వల్ల చదువుతో పాటు అర్థం చేసుకోవటానికి చాలా సులభంగా ఉంటుంది. గతేడాది కొద్దిగా భయం ఉండేది. ప్రస్తుతం ద్విభాషలో పుస్తకాలు ముద్రించడం వల్ల పదో తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తాం. – దుర్గె అశ్విని, 10వ తరగతి

భయం పోయింది



పదో తరగతిలో ద్విభాషలో పుస్తకాలు ముద్రించి రావడంతో, పాఠాలు సులభంగా అర్థం అవుతున్నాయి. ఉపాధ్యాయులు చెప్పిన అంశాలను తెలుగులో చదవడంతో ఆంగ్లంలో ఈజీగా ఉంది. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తామనే భరోసా వచ్చింది. – నివేధిక్, 10వ తరగతి

విద్యార్థులకు చాలా సులభం



ద్విభాషాలో 8వ తరగతి నుంచి పదో తరగతి వరకు పుస్తకాలు ముద్రించడం వల్ల సులభంగా అర్థమయ్యేలా విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేలా ఉంది. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను బోధించవచ్చు. విద్యా బోధనలో ఎటువంటి ఇబ్బంది రాకుండా మంచి నిర్ణయం తీసుకున్నారు. – పవర్ అనిత, నోడల్ అధికారిణి, నార్నూర్

మాజీ ఎంపీకి నివాళి



నివాళులర్పిస్తున్న వ్యాపారులు, నాయకులు

ఇంద్రవెల్లి: మండలకేంద్రంలోని మారుతి పటేల్ నివాసం వద్ద మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్ చిత్రపటానికి వ్యాపారులు, ఆయా రాజకీయ పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా జిల్లా అభివృద్ధికి మాజీ ఎంపీ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండలాధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్, మండల కోఆప్షన్ మాజీ సభ్యుడు మీర్జా జీలానిబేగ్, ఆయా పార్టీల నాయకులు కేంద్రే బాలాజీ, రాజు, వాగ్మరే కామ్‌రాజ్, మహ్మద్ జునైద్, రాథోడ్ అమోల్, రాజలింగు, చంపత్‌రావ్ తదితరులున్నారు.

పరామర్శ

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్‌లోని మాజీ ఎంపీ, బీజేపీ నేత రాథోడ్ రమేశ్ కుటుంబసభ్యులను మంగళవారం ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్, సీఐ మొగిలి, ఎస్సై మనోహర్ వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈసందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ ఆధ్వర్యంలో సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర సమితి భ్యురాలు నళినిరెడ్డి.. మాజీ ఎంపీ చిత్రపటానికి నివాళులర్పించారు.

పేదల పెన్నిధి మంత్రి సీతక్క

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



వేడుకలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

ఉట్నూర్‌రూరల్: పేదప్రజల పెన్నిధి మంత్రి సీతక్క అని.. ఉమ్మడి జిల్లా అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి మంత్రి సీతక్క జన్మదిన వేడుకలు నిర్వహించారు. వికాసం ప్రత్యేక పాఠశాలలో కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ దివ్యాంగులతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఖయ్యూం, చంద్రయ్య, ఎక్బాల్, సుశీల్, స్వామి, సలీం, పాఠశాల హెచ్‌ఎం వికాస్, భీమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ ఆవరణలో మంగళవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొర్ల రాజుయాదవ్, పీఏసీఎస్ డైరెక్టర్ పోశెట్టి, భోజన్న, షేక్ షాకీర్, గంగాధర్, శేఖర్, అబ్దుల్ హసీబ్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

బేల: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్తున్న 16మంది ఉపాధ్యాయులను మంగళవారం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం కోల నర్సింలు, ఉపాధ్యాయులతో పాటు ఆయా పార్టీల నాయకులతో కలిసి బదిలీ ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. మాజీ సర్పంచ్ తేజ్‌రావు, ఆయా పార్టీల నాయకులు దత్తా నిక్కమ్, గుండవార్ సంజయ్, శివకుమార్ పాల్గొన్నారు.

కప్పర్లలో..

తాంసి: మండలంలోని కప్పర్ల ప్రాథమిక పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను మంగళవారం గ్రామస్తులు సన్మానించారు. పాఠశాలలో 12ఏళ్లు పని చేసిన హెచ్‌ఎం రాజన్న, ఉపాధ్యాయులు జయవర్ధన్, కుసుమ, జయశ్రీని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సదానంద్, మహేందర్, నారాయణ, గంగన్న తదితరులు ఉన్నారు.

రథయాత్ర జయప్రదం చేయండి

ఎదులాపురం: ఇస్కాన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఈ నెల 13న నిర్వహిస్తున్న జగన్నాథుని రథయాత్రను జయప్రదం చేయాలని ఇస్కాన్ ప్రతినిధి ప్రేమ్‌నర్తన్ ప్రభుజి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం మాట్లాడారు. రథయాత్ర మధ్యాహ్నం 12గంటల నుంచి 6గంటల వరకు పట్టణ పురవీధుల గుండా కొనసాగుతుందని, రథయాత్ర పొడవునా సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని భక్తులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఇందులో గిరిధర్‌దాస్, ప్రశాంత్, శ్రీనందనందన్ తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ కష్టాలు

- భీంపూర్ మండలంలో నిలిచిన విద్యుత్ సరఫరా
- భీంసరిలో నేలకొరిగిన స్తంభం
- 21 గంటలకు పునరుద్ధరించిన అధికారులు



స్తంభాన్ని సరిచేస్తున్న విద్యుత్ సిబ్బంది

తాంసి: విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో భీంపూర్ మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు సోమవారం రాత్రి 8 నుంచి మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆదిలాబాద్‌రూరల్ మండలం భీంసరి గ్రామశివారు పంట చేన్లలో 33కేవీలైన్ విద్యుత్ స్తంభం నెలకొరిగింది. దీంతో తాంసి, భీంపూర్ మండలాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తాంసి మండలానికి తలమడుగు మండలం నుంచి తాత్కాలికంగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. కానీ భీంపూర్ మండలవాసులకు కరెంట్ కష్టాలు తప్పలేదు. చిన్నారులు, వృద్ధులు దోమలతో ఇబ్బంది పడ్డారు. భీంసరిలో చేన్లలో బురద ఉండటంతో మరమ్మతు చేసేందుకు సిబ్బంది తీవ్ర ఇబ్బంది పడ్డారు. మిషన్ వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ఐదు గంటలు కష్టపడి.. సిబ్బందే తాళ్ల సాయంతో నేలకొరిగిన స్తంభాన్ని సరిచేశారు. తాంసి, భీంపూర్, తలమడుగు, ఏఈలు మనోజ్, శ్రావణ్, సతీశ్ సిబ్బందితో కలిసి మరమ్మతుల్లో పాల్గొన్నారు.

గ్రాండ్ టెస్టుల పరిశీలన



పరిశీలిస్తున్న రాజలింగు, ప్రవీణ్ కుమార్

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్ సెంటర్‌లో రెండు రోజులుగా గ్రూప్–2 పరీక్షకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు గ్రాండ్ టెస్టులు కొనసాగుతున్నాయి. జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు స్టడీ సర్కిల్ సెంటర్‌ను మంగళవారం సందర్శించి గ్రాండ్ టెస్టులు కొనసాగుతున్న విధానాన్ని పరిశీలించారు. గ్రాండ్ టెస్టు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోని వారు కూడా గ్రాండ్ టెస్టు రాయాలని, ఆసక్తి ఉంటే మిగిలిన 2, 3, 4 గ్రాండ్ టెస్టులకు హాజరై రాయవచ్చన్నారు. బీసీ స్టడీ సర్కిల్ సెంటర్ గ్రూప్–1 ఉచిత శిక్షణ పొందిన వారిలో 52మంది అభ్యర్థులు ప్రిలిమ్స్‌లో అర్హత సాధించారని పేర్కొన్నారు. ఈయన వెంట స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం



మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రాతపుస్తకాలు పంపిణీ చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు ఏబీవీపీ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సాయి, పాకాల వినీత్, తేజురెడ్డి, శ్రీను, అక్షయ్ గజపతి, పాకాల అరుణ్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంలో యువకులు, నాయకులు

బేల: మండల కేంద్రంలోని శ్రీరామ మందిరం కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో 76ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం యువకులు, వయోజనులు మొత్తంగా 35మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా హాస్టల్ కన్వీనర్ మాడవార్ హరీష్‌రెడ్డి, సభ్యులు పవన్‌రెడ్డి, మనోజ్‌రెడ్డి, తరుణ్, రిమ్స్ వైద్య బృందం, ఆయా పార్టీల నాయకులు దత్తా నిక్కమ్, ఇంద్రశేఖర్, గుండవార్ సంజయ్, బర్కాడే రాము, పోత్రాజ్ శ్రీకాంత్, రాజు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

వైద్యశిబిరం

తాంసి: మండలంలోని గోట్కూరి గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించారు. 52 మందికి జ్వర లక్షణాలున్నట్లు గుర్తించి మందులు పంపిణీ చేశారు. సూపర్‌వైజర్ తులసీరాం, ఏఎన్‌ఎం కళావతి, ఆశవర్కర్లు ఉన్నారు.

నీలగిరి ప్లాంటేషన్‌కు ఏర్పాట్లు

నేరడిగొండ: మండలంలోని వాగ్దారి గ్రామంలో పదెకరాల్లో నీలగిరి మొక్కలు నాటేందుకు మంగళవారం ఓ రైతు చేనును ఎంపీడీఓ రాజ్‌వీర్ పరిశీలించారు. వారి వెంట ఈజీఎస్ ఏపీఓ వసంత్‌రావు తదితరులు ఉన్నారు.

జగదాంబ ఆలయంలో పూజలు

బోథ్: మండలంలోని ఘన్పూర్ జగదాంబదేవి ఆలయంలో మంగళవారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా గ్రామస్తులు ఆయనను సత్కరించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగారెడ్డి, బద్దం పోతారెడ్డి, బాబు, అంకుశ్ పాల్గొన్నారు.

నేడు ప్రారంభం

బోథ్: మండలంలోని సోనాల గ్రామంలో రూ.1.30 కోట్లతో నిర్మించిన మున్నూరుకాపు సంఘం భవనాన్ని బుధవారం ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రారంభిస్తారని వీడీసీ అధ్యక్షుడు తుల శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మాజీ మంత్రి జోగు రామన్న, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి గజేందర్, నాయకులు హాజరవుతారని.. మున్నూరు కాపు సోదరులు హాజరుకావాలని కోరారు.

సన్మానం

ఇచ్చోడ: అంకితభావంతో పని చేస్తే ఉపాధ్యాయులకు గుర్తింపు ఉంటుందని మండలంలోని కోకస్‌మన్నూర్ జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయారెడ్డి అన్నారు. బదిలీపై వెళ్తున్న విజయారెడ్డిని మంగళవారం పాఠశాలలో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. అడెల్లు, బుచ్చిబాబు, మహేందర్‌గౌడ్, సంతోష్, మల్లేశ్ ఉన్నారు.

మాజీ ప్రజాప్రతినిధులకు ఆత్మీయ సన్మానం

తలమడుగు: మంత్రి సీతక్క సహకారంతో తలమడుగు మండల అభివృద్ధికి కృషి చేస్తానని తాజా మాజీ జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో రెడ్డి సంఘం, అంబేద్కర్ సంఘం, మైనార్టీ సంఘాల ఆధ్వర్యంలో ఇటీవల పదవీకాలం పూర్తి చేసుకున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మాజీ ఎంపీపీ లక్ష్మి రాజేశ్వర్, మాజీ జెడ్పీటీసీ, బాబన్న, ప్రకాశ్‌రావు, దేవన్న, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర స్పెషల్ ఆఫీసర్ స్వామి, అశోక్‌రెడ్డి, ధనుంజయ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మనోహర్‌రెడ్డి, పద్మాకర్‌రెడ్డి, గంగన్న, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు దేవన్న, బీసీ సంఘం మండలాధ్యక్షుడు రవికాంత్, రవి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తను పరామర్శించిన మాజీ మంత్రి

ఆదిలాబాద్‌టౌన్: అనారోగ్యానికి గురై శస్త్రచికిత్స జరిగిన ఆదిలాబాద్ పట్టణం సుభాష్‌నగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ వార్డు అధ్యక్షులు అన్నెల వసంత్‌ను మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న మంగళవారం పరామర్శించారు. ఆయన వెంట రాజన్న, అశోక్, సతీష్, సురేందర్ తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

ఇచ్చోడ: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాగర్ అన్నారు. మంగళవారం మండలంలోని పొన్న గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. 69 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందించారు. ఏఎన్‌ఎం కరుణ, హెల్త్‌అసిస్టెంట్ రాజ్‌కిరణ్, ఆశవర్కర్లు సుశీల, సాగరిక ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

నేరడిగొండ: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఏఎన్‌ఎంలు సంగీత, సౌందర్య అన్నారు. మంగళవారం మండలంలోని వడూర్ లో అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు గంగామణి, రమాదేవి, మమత, ఆశవర్కర్లు సుజాత, పుష్ప ఉన్నారు.

దినసంతకు వేలం

ఇచ్చోడ: మేజర్ పంచాయతీ పరిధిలో నిర్వహించే దినసంతకు మంగళవారం పంచాయతీ కార్యాలయంలో వేలం నిర్వహించగా రూ.6.75 లక్షల ఆదాయం సమకూరింది. పంచాయతీ ప్రత్యేకాధికారి ఎంపీడీవో లక్ష్మణ్ ఆధ్వర్యంలో జరిగిన వేలంలో పాల్గొని సంత నిర్వహణను స్థానిక వ్యాపారి దక్కించుకున్నట్లు పంచాయతీ ఈవో సూర్యప్రకాశ్ తెలిపారు.

కార్యకర్తలు ప్రజాప్రతినిధులు కావాలి

- ఎంపీ గోడం నగేశ్



ఎంపీ నగేశ్‌ను సన్మానిస్తున్న నాయకులు

గుడిహత్నూర్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధిస్తుందని, కార్యకర్తలు ప్రజా ప్రతినిధులుగా సేవలందించాలని ఎంపీ గోడం నగేశ్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన బీజేపీ విజయోత్సవ సభకు ఆయన హాజరై మాట్లాడారు. తనకు ఓటు వేసి గెలిపించిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలన్నారు. అనంతరం ఎంపీని గజమాలతో సన్మానించారు. ఇందులో పార్టీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, మండలాధ్యక్షుడు కేంద్రే శివా జీ, జిల్లా అధికార ప్రతినిధి లక్ష్మణ్, నాయకులు భరత్, జాలీం పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన గ్రామస్తులు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ మండలం చాందూరి పంచాయితీ పరిధిలోని భీంజీగూడ గ్రామస్తులు మంగళవారం ఎంపీ గోడం నగేశ్ నివాసంలో వారిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని ఎంపీని కోరగా సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు భూమన్న, వెంకటేశ్, లచ్చు తదితరులున్నారు.

వడూర్ సబ్‌స్టేషన్ ఎదుట నిరసన

నేరడిగొండ: రెండు నెలలుగా విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతుండటంతో దర్బ, దర్బతండా గ్రామస్తులు మంగళవారం రాత్రి వడూర్ సబ్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ రాత్రి గ్రామాల్లో అంధకారం నెలకొంటుందని.. వర్షాకాలం బయటకు వెళ్లేందుకు భయపడుతున్నామని పేర్కొన్నారు. సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని.. లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఐలమ్మ కాలనీ ఏర్పాటు చేయాలి

ఆదిలాబాద్: రజకుల కోసం ప్రత్యేకంగా ఐలమ్మ కాలనీ ఏర్పాటు చేయాలని జై రజక సంఘం కమిటీ నాయకులు ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను కోరారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గత 40 సంవత్సరాలుగా సొంత ఇళ్లు లేక రజక సోదరులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రజకుల సమస్యలను దష్టిలో ఉంచుకొని ఇంటి స్థలాలను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

'నిధులు పక్కదారి పడుతున్నయ్'

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీల్లో వెనుకబడి ఉన్న పీవీటీజీల సంక్షేమం, అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం జిల్లాలోని ఐటీడీఏకు రూ.24కోట్లు కేటా యిస్తే, ఐటీడీఏ పీవో వాటిని పక్కదారి మళ్లిస్తున్నారని కొలాం హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కొడప సోనేరావ్ ఒక ప్రకటనలో ఆరోపించారు. ఆ నిధులను కొలాం, ప్రధాన్, తోటి, ఇతర కులస్తుల వారికి తేనే టీగల పెంపకం, గొర్రెలు, మేకల పెంపకంపై శిక్షణను అందజేసి ఉపాధి కల్పించాలన్నా రు. పీవీటీజీల అభివృద్ధికి ఖర్చు చేయాల్సి ఉండగా, వాటిని ఇతరులకు కేటాయిస్తున్నారని విమర్శించారు. కలెక్టర్ స్పందించి పీవీటీజీల కోసం కేటా యించిన నిధులలో రాజకీయ జోక్యం లేకుండా చూడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పీవీటీజీల కోసం కేటాయించిన నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తమ గ్రామాల్లో రోడ్లు, మురికి కాలువలు, విద్యుత్, వైద్య సౌకర్యాలు కల్పించాలన్నారు. లేనియెడల ఐటీడీఏను ముట్టడిస్తామని హెచ్చరించారు.